తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

- వడదెబ్బ నివారణకు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి
- అధికారులకు కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశం

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 2 : జిల్లాలో వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు బీ రాహుల్, సబావత్ మోతీలాల్, ప్రత్యేక ఉపపాలనాధికారి (ఎల్ఏ, ఆర్ అండ్ ఆర్) చంద్రకళ, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, డీఎంహెచ్‌వో జీసీ సుబ్బారాయుడుతో కలిసి ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీవోలు, గ్రామ ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా కోసం జిల్లా ఇన్‌చార్జిగా జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) వ్యవహరిస్తారని, మండల, గ్రామ, వార్డు స్థాయిల్లో ప్రత్యేక అధికారులను నియమించి అవసరమైన కార్యాచరణ రూపొందించి,

పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు

చేతిపంపులు, బోర్‌వెల్‌కు మరమ్మతులు వెంటనే చేపట్టామని ఇంకా మిగిలిన సమస్యలపై దృష్టి సారించాలన్నారు. తాగునీటి సరఫరా లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. వ్యవసాయబోరుబావులు, ఎండిపోని తాగునీటి బోరుబావులను అద్దెకు తీసుకొని తాగునీరు అందించాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ నెల 5వ తేదీలోగా పూర్తి స్థాయిలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, డీఆర్‌డీఏ 105, పీఏసీఎస్ 130, డీసీఎంఎస్‌కు 27 కేంద్రాలను కేటాయించామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పర్యవేక్షించాలని, రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొందేలా చూడాలన్నారు. మిల్లర్ల నుంచి సీఎంఆర్ త్వరగా ఇచ్చేలా చూడాలని కోరారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి, జిల్లా నుంచి బియ్యం ఇతర రాష్ట్రాల్లోకి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. వడదెబ్బపై జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈజీఎస్ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు నీడ, తాగునీరు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వడదెబ్బ సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డెమో బుక్క వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ అధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్
- జనగామలో కార్డెన్ సెర్చ్

కోటపల్లి : గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సుధాకర్

కోటపల్లి, ఏప్రిల్ 2 : ఎలాంటి ప్రలోభాలకు, భయానికి లొంగకుండా ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ అన్నారు. కోటపల్లి మండలంలోని జనగామ గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించవద్దని గ్రామస్తులకు ఎలాంటి సమాచారం తెలిసినా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పాటిల్, ఏఎస్ఐ కాంతారావు పోలీసులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి : సీఐ రవీందర్

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, వారి ఓటు హక్కును నిర్భయంగా వినియోగించాలని, ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురి కావద్దని చెన్నూర్ సీఐ రవీందర్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని కన్నెపల్లి, బుద్ధారం గ్రామాల్లో సీఐ రవీందర్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గ్రామస్తులతో మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. బుద్ధారం, సంకారం, కన్నెపల్లి గ్రామాలు నక్సలైట్ల ప్రభావిత గ్రామాలు కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నక్సలైట్ల ప్రసంగాలకు ప్రభావితం కాకుండా ఉండాలని చూడాలని గ్రామస్తులకు తెలిపారు. గ్రామాల్లో సమస్యలున్నా, ఏదైనా సమాచారం తెలిసినా పోలీసులకు లేదా 100 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు. గ్రామంలో గుడుంబా స్థావరాలను గుర్తించి 15 లీటర్ల గుడంబాతో పాటు 11 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్ రూరల్ : గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రవీందర్

ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

- రిటర్నింగ్ అధికారి చంద్రకళ

మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి చంద్రకళ

చెన్నూర్, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా కచ్చితంగా ఎన్నికల నిబంధనలను పాటించాలని రిటర్నింగ్ అధికారి చంద్రకళ అన్నారు. చెన్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీవో, ఏపీవోలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారం కొనసాగాయి. ఈ శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల విషయంలో ఇబ్బంది తలెత్తితే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ శిక్షణ తరగతుల్లో బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పనితీరును వివరించడంతో పాటు పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ఫారాలు నింపే విధానంపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తరగతుల్లో 277మంది పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై పోస్టర్ విడుదల

పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో, అధికారులు

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 2: వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమ పోస్టర్‌ను అధికారులతో కలిసి డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు మంగళవారం ఆవిష్కరించారు. వైద్యారోగ్యాధికారి కార్యాలయంలో వడదెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. పనులకు వెళ్లే వారు ఉదయం 10 గంటల లోపే సాయంత్రం 4 గంటల తర్వాత వెళ్లి పనులను ముగించుకొని ఇంటికి వెళ్లాలని సూచించారు. అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తామని తెలిపారు.

డాక్యుమెంట్ రైటర్లు నిబంధనలు పాటించాలి

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 2: డాక్యుమెంట్ రైటర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో డాక్యుమెంట్ రైటర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో అధికంగా స్థలం కొనుగోళ్లు, విక్రయాలు, డబుల్ రిజిస్ట్రేషన్, ఫేక్ డాక్యుమెంట్ పత్రాలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కొంత మంది డాక్యుమెంట్ రైటర్లు తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఫేక్ డాక్యుమెంట్ సృష్టించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డాక్యుమెంట్ రైటర్లు అనుమతులు, రిజిస్ట్రేషన్ విధానంపై, రిజిస్ట్రేషన్ ఫీజులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్ట్

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ అశోక్

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 2: బెల్లంపల్లి పరిసర ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితులను పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. డీసీపీ మాట్లాడుతూ బెల్లంపల్లికి చెందిన లింగాల యశ్వంత్, తోట మనిదీప్, నవీద్, ముజ్జు మార్చి 24న చంద్రాపూర్ మహారాష్ట్రకి వెళ్లి తీసుకువచ్చారన్నారు. మంగళవారం యశ్వంత్, మనిదీప్ 11 వందల గ్రాముల గంజాయి విక్రయించేందుకు బెల్లంపల్లి కొత్త బస్టాండ్ సమీపంలోకి వచ్చారు. వారు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వద్ద ఉన్న కవర్‌ను అక్కడే పెట్రోలింగ్ చేస్తున్న ఎస్ఐ రమేశ్ తనిఖీ చేయగా గంజాయి లభించింది. నిందితులను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఎన్.దేవయ్య, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

భీమారం, ఏప్రిల్ 2 : భీమారం మండలంలోని కొత్తగూడెం కాలనీకి చెందిన దబ్బేట రాములు, లంబాడీతండాకు చెందిన తేజావత్ తుకారాం గుడుంబాను వేర్వేరుగా తయారు చేసి విక్రయిస్తుండగా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 8 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్ల ఎస్ఐ రాములు తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి మృతి

రామకృష్ణాపూర్,ఏప్రిల్ 2: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామాలయం ఏరియాలో నివాసం ఉండే సెగ్గం రామకృష్ణ కుమారుడు సెగ్గం మోహన్‌కుమార్ (17) ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..మోహన్ కుమార్ హైదరాబాద్‌లోని పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతున్నాడు. సెల్ ఫోన్‌తో ఎక్కువ గడపడంతో చదువుపై శ్రద్ధ చూపాలని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల నొప్పి భరించలేక..

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 2: తల నొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని గౌతమి నగర్‌కు చెందిన గులాబ్ చాంద్ కుమారుడు గణేశ్ శాని (22) టీ స్టాల్‌లో పని చేస్తున్నాడన్నారు. కొంత కాలంగా తలనొప్పి తో బాధపడుతుండేవాడని, తగ్గకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గణేశ్ శాని తండ్రి చాంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత

తాండూర్, ఏప్రిల్ 2 : మండలంలోని మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామపంచాయతీకి చెందిన శనిగరపు సుజాత కుమార్తె శ్రావణి వైద్య చికిత్స కోసం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ రూ.5 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని అందజేశారుఈ కార్యక్రమంలో మాదారం ఎంపీటీసీ సూరం రవీందర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ గట్టు మురళీధర్ రావు, కాంగ్రెస్ యువజన నాయకులు పుట్ట శ్రీనివాస్, తదితరులున్నారు.

పదోతరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనంపై సమావేశం

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 2 : పదవ తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనంపై మంగళ వారం అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లకు సమావేశం నిర్వహించి జిల్లా విద్యా శాఖాధికారి యాదయ్య పలు సూచనలు చేశారు. స్పాట్ వాల్యూయేషన్‌కు కేటాయించిన సీఈలు/ఏఈలు ఈ నెల 3న తొమ్మిది గంటలలోపు రిపోర్టు చేయాలని, లేకుంటే సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలోనికి ఎవరు కూడా మొబైల్ ఫోన్ తీసుకురావద్దని, క్యాం పు సిబ్బంది అంతా విధిగా ఐడీ కార్డు ధరించాలని, ఇతరులు ప్రవేశించడానికి అనుమతి లేదని క్యాంపు ఆవరణలో ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టడానికి వీలు లేదని తెలిపారు. క్యాంపు నిబంధనలు పాటిస్తూ సకాలంలో హాజరు కావాలని సూచించారు.

రాకపోకలను పునరుద్ధరించాలి

జన్నారం, ఏప్రిల్ 2 : మండలంలో కవ్వాల్ ఫారెస్ట్ మీదుగా భారీ వాహనాల రాకపోకలను పునరుద్ధరించాలని కోరుతూ నాయకులు నిరసన వ్యక్తం చేసి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వెంటనే కవ్వాల్ టైగర్ రిజర్వ్‌డ్ ఫీల్డ్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భూమాచారి, ఓంకారేశ్వర్, కే మహేశ్, దాసరి తిరుపతి, అక్బర్, మక్సూ ద్, మోబిన్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయంలో సమస్యలు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ రాహుల్‌కు పోటీ పరీక్షల అభ్యర్థుల వినతి

అభ్యర్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

బెల్లంపల్లి, ఏప్రిల్ 2 : గ్రంథాలయంలో బోర్‌వెల్ వేయించాలని, సమస్యలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రాహుల్‌ను పోటీ పరీక్షల అభ్యర్థులు కోరారు. బెల్లంపల్లి శాఖ కాళోజీ గ్రంథాలయాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ రాహుల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోటీ పరీక్షల అభ్యర్థులను ఆయన పలకరించగా బోర్‌వెల్ లేకపోవడంతో టాయిలెట్స్ వెళ్లేందుకు అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. స్పందించిన అదనపు కలెక్టర్ వెంటనే ఏఈ వినయ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రెండ్రోజుల్లో బోర్‌వెల్ ఏర్పాటుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఏఈని ఆదేశించారు. ఇప్పటికే గ్రంథాలయంలో వైఫై సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. వచ్చే పదిహేను రోజుల లోపు ఆన్ డిమాండ్ మేరకు పోటీ పరీక్షల అన్ని పుస్తకాలను అందుబాటులోని తీసుకువస్తామని తెలిపారు. నమస్తే తెలంగాణ కథనానికి స్పందించి ఎన్ఆర్ఐ తోడే వెంకటకృష్ణారెడ్డి వారంలో శని, ఆదివారాలు తమకు ఉచితంగా భోజనం అందిస్తున్నారని అభ్యర్థులు తెలిపారు. మరో ఐదు రోజులు ఈ మూడు నెలల కాలంలో ఉచిత భోజనం అందించాలని కోరారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉచిత భోజనం అందించడానికి ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రూప్ 1, 2 , డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచితంగా మాక్ టెస్టులు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన పనులను సబ్ కలెక్టర్ పరిశీలించారు. త్వరగా నిర్మాణ పనులను ఆదేశించారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ గోపు మల్లారెడ్డి ఉన్నారు.

ప్రతి గ్రామంలో ఉపాధి కూలీలకు పని కల్పించాలి

వేమనపల్లి, ఏప్రిల్ 2 : ప్రతి గ్రామపంచాయతీలో ఉపాధి హామీ కూలీలకు పనులను కల్పించాలని ఎంపీడీవో దేవేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కూలీలు వంద రోజులు పనులు చేసేలా చూడాలని, రూ. 300 ప్రతి కూలీకి అందేలా మార్కింగ్ ఇచ్చి పనులను చేయించాలన్నారు. అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో వచ్చే హరితహారం నాటికి మొక్కలను సిద్ధం చేయాలన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలన్నారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏపీవో సత్య ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిలో..

మందమర్రి రూరల్, ఏప్రిల్2: ఉపాధి హామీ పనులపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేశ్వర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉదయం పూటనే పనులు నిర్వహించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలని సూచించారు. ప్రతి గ్రామంలో 150 మంది మించకుండా కూలీలు పనికి వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రజియా సుల్తానా టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ బాలల పుస్తక దినోత్సవం

సేవా జ్యోతి శరణాలయంలో వేడుకల్లో పుస్తకాలతో శ్రీదేవి, పిల్లలు

తాండూర్, ఏప్రిల్ 2 : మండల కేంద్రంలోని సేవాజ్యోతి శరణాలయంలో మంగళవారం ప్రపంచ బాలల పుస్తక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శరణాలయం వ్యవస్థాపక అధ్యక్షురాలు గజ్జెల్లి శ్రీదేవి మల్లేశం మాట్లాడుతూ తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులకు మొబైల్స్ అందుబాటులో ఉంచకుండా, మంచి కథలు, ఆధ్యాత్మిక, అమృతవాహిని సేవా నిరతి గల పుస్తకాలు పిల్లలతో కాసేపు చదివించి, ఆట పాటలు నేర్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంకరం, శ్యామ్, శ్రీలక్ష్మి, మానసిక మతిస్థిమితం లేని మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ ఈఎంటీ డే వేడుకలు

కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న 108 సిబ్బంది

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 2: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖాన 108 జిల్లా కార్యాలయంలో మంగళవారం నేషనల్ ఈఎంటీ డే వేడుకలు పురస్కరించుకొని ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా 108 అంబులెన్స్ వాహనాల పోగ్రామ్ మేనేజర్ సామ్రాట్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మంచిర్యాల జిల్లాలోని ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ హాజరై కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. మేనేజర్ సామ్రాట్ మాట్లాడుతూ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల 108 వాహనాల జిల్లా ముఖ్య కార్య నిర్వహణ అధికారి సంపత్ వివిధ మండలాల ఈఎంటీలో పైలెట్లు, 108 అంబులెన్స్ వాహనాల సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురి రిమాండ్

తాండూర్, ఏప్రిల్ 2 : తాండూర్ మండల పరిధిలో ఓ వ్యక్తి మిస్సింగ్ అయి మృతదేహంగా లభించిన సంఘటన తెలిసిందే. అతని మృతికి కారణమైన ముగ్గురు నిందితులను మంగళవారం రాత్రి రిమాండ్ చేసి జైలుకు తరలించినట్లు తాండూర్ సర్కిల్ సీఐ కుమారస్వామి, తాండూర్ ఎస్ఐ జగదీశ్‌గౌడ్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం తాండూర్ మండల కేంద్రమైన ఐబీ ప్రాంతానికి చెందిన మహ్మద్ అజ్గర్ అలీ మార్చి 31న అదృశ్యమయ్యాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మరుసటి రోజే అబ్బాపూర్ ఓసీపీ పరిసర ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించడంతో దాన్ని మిస్సింగ్ అయిన అజ్గర్‌గా గుర్తించారు. హత్యకు గల కారణాలను విచారిస్తుండగా కాల్‌డేటా ఆధారంగా మండలకేంద్రంలోని మసీదు లైన్‌కు చెందిన అఫ్జల్, రెహాన్, హర్షి యాబేగంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు తాము చేసిన నేరాన్ని ఒప్పుకోవడంతో రిమాండ్ చేసి ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

నంది పురస్కారాలు

అవార్డుతో జీ రాజలింగు

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 2: సీసీసీ నస్పూర్‌కు చెందిన సింగరేణి కార్మికులు గజెల్లి రాజలింగుకు నంది పురస్కారం లభించింది. 25 సంవత్సరాలుగా ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన శిఖర ఆర్ట్ సంస్థ నంది పురస్కారానికి ఎంపిక చేసింది. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరుగగా, గజెల్లి రాజలింగు ప్రముఖుల చేతులమీదుగా నంది పురస్కారాన్ని అందుకున్నారు. రాజలింగు సింగరేణిలో ఉద్యోగం చేస్తూ.. కమ్యూనికేషన్ సెల్ ద్వారా ఎన్నో సందేశాత్మక సీరియల్స్, నాటికల ప్రదర్శనలు ఇచ్చారు. గజెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వేసవిలో చలి వేంద్రాలు, అంబలి పంపిణీ కేంద్రాల నిర్వహణ, కరోనా సమయంలో ఎంతో మందికి నిత్యావసర వస్తువులు, భోజనం, ఎనర్జీ డ్రింక్స్ అందజేశారు. హరిత హారం, మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వారిలో చైతన్యం తీసుకురావడానికి కృషి చేశారు. కళాకారుడిగా కోలిండియా, జాతీయ, రాష్ట్ర స్థాయి లో అనేక బహుమతులు సాధించారు. తనకు నంది పురస్కారం రావడానికి కృషి చేసిన కళాకారులు అంతడుపుల నాగరాజు, నరేశ్‌కు గజెల్లి రాజలింగు కృతజ్ఞతలు తెలిపారు.

ఏల్పుల బుచ్చమ్మకు..

అవార్డు అందుకుంటున్న ఏల్పుల బుచ్చమ్మ

కాసిపేట, ఏప్రిల్ 2 : కాసిపేట మండలంలోని ముత్యంపల్లికి చెందిన ఏల్పుల బుచ్చమ్మకు నంది అవార్డు పురస్కారం లభించింది. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి శిఖర ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో పురస్కారం అందించారు. ముత్యంపల్లి పాఠశాలలో వంట నిర్వాహకురాలిగా పని చేస్తున్న బుచ్చమ్మ విద్యార్థులకు మంచి సేవలందిస్తున్న సందర్భంగా సామాజిక నిస్వార్థ సేవా రంగంలో పురస్కారానికి ఎంపిక చేసి అవార్డును అందించారు.

గజెల్లి మోహన్‌కు..

అవార్డు అందుకుంటున్న గజెల్లి మోహన్

బెల్లంపల్లి, ఏప్రిల్ 2 : బాబుక్యాంపు బస్తీకి చెందిన సామాజిక సేవా కార్యకర్త గజెల్లి మోహన్‌కు నంది అవార్డు దక్కింది. శిఖర ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన అవార్డును అందుకున్నారు. మోహన్ ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా, ప్రోగ్రాం అధికారిగా, సంఘమిత్ర యూత్ క్లబ్, జన విజ్ఞానవేదిక, లోక్‌సత్తా, తెలంగాణ విద్యావంతుల వేదిక, టీజేఏసీ, పలు స్వచ్ఛంద సేవా సంస్థలకు ప్రతినిధి, సలహాదారుడిగా, గజెల్లి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడిగా సేవలందిస్తున్నారు.

సింగరేణి

ఎన్నికల కోడ్ పేరుతో కార్మికులకు ఉద్యోగోన్నతి లేఖల పంపిణీ ఆపద్దు

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

మాట్లాడుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, ఏప్రిల్ 2 : కార్మికులకు ఎన్నికల కోడ్ పేరుతో ఉద్యోగోన్నతి లేఖల పంపిణీని ఆపవద్దని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ 1 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల పేరుతో కార్మికులకు ఉద్యోగోన్నతి లేఖలివ్వక పోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రతి యేటా ఇవ్వాల్సిన ప్రమోషన్ లెటర్లు ఎలా ఆపుతారన్నారు. గుర్తింపు ఎన్నికలు జరిగి 4 నెలలైనా ఆర్ఎల్సీ, యాజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వక పోవడం సరికాదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయని ఆరోపించారు. వెంటనే తమ యూనియన్‌కు గుర్తింపు పత్రం ఇచ్చి కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు